సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 7 । జూలై । 2024



ప్రేమగా.. పెంపుడు శునకంతో..

జిల్లాకోర్టు సమీపంలోని ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రి ప్రాంగణంలో శనివారం పెంపుడు శునకాలు సందడి చేశాయి. 8లో



రథయాత్ర కోసం స్పెషల్ రైళ్లు

పూరీ రథయాత్ర కోసం వాల్తేర్ డివిజన్ నుంచి పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. 8లో



ఉత్కంఠ పోరులో టైటాన్స్ గెలుపు 8లో

న్యూస్‌రీల్

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా రవీంద్ర బాధ్యతలు



రవీంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యదర్శి దాట్ల కీర్తి, ఇతర అధికారులు

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా వి.రవీంద్ర శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆయన సంస్థ జాయింట్ కమిషనర్‌గా వ్యవహరించారు. ఇటీవలే జిల్లా కలెక్టర్, మెట్రోపాలిటన్ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జాయింట్ కమిషనర్‌గా ఉన్న రవీంద్రకు అదనపు బాధ్యతలు ఇచ్చి కమిషనర్‌గా నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు తీసుకోగా సంస్థ కార్యదర్శి దాట్ల కీర్తి, ఇతర విభాగాధిపతులు, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కోస్టల్ సెక్యూరిటీపై అధ్యయనం

మంగమారిపేటలో ట్రైనీ ఐపీఎస్‌ల బృందం



మాట్లాడుతున్న మెరైన్ డీఎస్పీ కాళిదాసు

కొమ్మాది: ఫీల్డ్ అండ్ ప్రాక్టికల్‌లో భాగంగా కోస్టల్ సెక్యూరిటీ అధ్యయనానికి ట్రైనీ ఐపీఎస్‌లు శనివారం జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట తీర ప్రాంతంలో పర్యటించారు. మెరైన్ డీఎస్పీ ఎస్.కాళిదాసు ఆధ్వర్యంలో వారు మత్స్యకారులతో సమావేశమయ్యారు. మత్స్యకారుల జీవన విధానాలు, తుపాను సమయంలో వారు ఎదుర్కొనే సమస్యలపై అధ్యయనం చేశారు. కోస్టల్ సెక్యూరిటీకి సంబంధించి విధి విధానాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భీమిలి ఎస్‌డీవో లావణ్య మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మత్స్యకారులకు అందే ప్రయోజనాలు, చేపల వేటాడే విధానం ట్రైనీ ఐపీఎస్‌లకు వివరించారు. మెరైన్ సీఐ సతీష్‌కుమార్, ఎస్‌ఐలు వి. శ్రీనివాసరావు, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీస్ రెన్యువల్‌కు దరఖాస్తులు

మద్దిలపాలెం: జోన్–1, 2 పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికపై పని చేస్తున్న అధ్యాపకులు సర్వీస్ రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.వి జయ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జోన్–1లో 147, జోన్–2లో 174 పోస్టులకు రెన్యువల్ చేస్తారని పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో 2024, మార్చి 31 నాటికి కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పని చేసిన వారు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. జూలై 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 15వ తేదీన జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో కౌన్సెలింగ్, 16న రెన్యువల్ అయిన ఒప్పంద అధ్యాపకుల ఒప్పందం ఉంటుందని వివరించారు.

సహకార సంఘాలతో మెరుగైన భవిష్యత్



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డీసీసీబీ సీఈవో వర్మ

విశాఖ విద్య: సహకార సంఘాల ద్వారా అందరికీ మెరుగైన భవిష్యత్ ఇవ్వడమే లక్ష్యంగా అధికారులు, ఉద్యోగులంతా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈవో డి.వి.ఎస్. వర్మ అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం మద్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో విశాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, అనకాపల్లి జిల్లా కో–ఆపరేటివ్ ఆడిట్ అధికారి గోవిందరావు, బ్యాంక్ డిప్యూటీ రిజిస్ట్రార్ జి.హరిప్రసాద్‌తో కలసి పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అసమానతలను రూపుమాపడమే లక్ష్యంగా సహకార బ్యాంకులు పని చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని కో–ఆపరేటివ్ బ్యాంకులు, వాటి పరిధిలోని సహకార సంఘాల ద్వారా మెరుగైన సేవలు అందించాలన్నారు. సహకార రంగం పట్ల అవగాహన పెంచుకోవడం, అంతర్జాతీయ సంఘీభావం, ఆర్థిక సామర్థ్యం, సమానత్వం, ప్రపంచ శాంతిని ప్రోత్సహించడమే అంతర్జాతీయ సహకార దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. సహకార విద్యాధికారి జి.సోమేశ్వరరావు, బ్యాంకు జీఎం డి.అన్నపూర్ణ, బి.శ్రీనివాసరావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వందేళ్ల నేస్తాలు

- నగర పరిధిలో పురాతన వృక్షాల గుర్తింపునకు శ్రీకారం
- డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్న ఇంటాక్
- వందేళ్లకు పైబడిన చెట్లు 20 వేలకు పైగా ఉంటాయని అంచనా
- ఇప్పటికే 800 వృక్షాలు గుర్తించిన ఇంటాక్ ప్రతినిధులు
- ఈ చెట్లే పర్యావరణ పరిరక్షణ నేస్తాలుగా ప్రచారం



వారసత్వ వృక్షాలపై అధ్యయనం చేస్తున్న ఇంటాక్ బృందం



నగరంలోని ఓ శతాబ్ది వృక్షం

సాక్షి, విశాఖపట్నం: వారసత్వ వృక్షాలను ప్రజలకు అనుసంధానం చేయడం ద్వారా చెట్ల పట్ల ఆప్యాయత, అనుబంధాన్ని పెంపొందించేందుకు ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్(ఇంటాక్) నడుం బిగించింది. నగరంలో ఉన్న శతాబ్ది వృక్షాల వారసత్వ సంపదని గుర్తించి, పరిరక్షించేందుకు ప్రత్యేక డాక్యుమెంట్ సిద్ధం చేస్తోంది. విశాఖ నగర పరిధిలో వందేళ్లకు పైబడిన వృక్షాలు 20 వేలకు పైగా ఉన్నట్లు అంచనా వేసింది. ఇప్పటివరకు సుమారు 800 వృక్షాలను గుర్తించింది. వారసత్వ వృక్షాల పరిరక్షణకు 1975లో చెట్ల రక్షణ, సంరక్షణ చట్టం ఏర్పాటు చేశారు. చెట్ల సంరక్షణకు సంబంధించి అన్ని నిర్ణయాలను తీసుకునే స్థానిక పౌర సంస్థలతో కలిసి నగర పాలక సంస్థలు సిద్ధం కావాలని చట్టంలో పేర్కొన్నారు. కానీ.. ఆ పరిస్థితులు నగరంలో ఎక్కడా కనిపించకపోవడంతో ఇంటాక్ సంస్థ ఆ బాధ్యతను తన భుజస్కందాలపై కెత్తుకుంది.

వారసత్వ వృక్షాలంటే..?

1975 చట్టం ప్రకారం 50 ఏళ్ల లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉన్న ఏ చెట్టునైనా వారసత్వ వృక్షంగా నిర్వచించాలి. ఈ క్రమంలో చెట్టు చారిత్రక ప్రాముఖ్యతను కూడా పరిగణించాలి. స్థానిక అథారిటీ వారసత్వ చెట్ల గణనతో పాటు ప్రతి ఐదేళ్లకు ఒకసారి చెట్ల గణనను నిర్వహించాలి. కానీ నగరంలో ఎక్కడా అది అమలవ్వడం లేదు.

నగరంలో 20 వేలకు పైగా..

ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన మాజీ పర్యావరణ, వృక్షశాస్త్ర ప్రొఫెసర్ల నేతృత్వంలో వైజాగ్‌లోని పర్యావరణవేత్తలు నగర పరిధిలో 20 వేల వారసత్వ వృక్షాలు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించి ఇంటాక్ ప్రతినిధులు నగరంలో అధ్యయనం ప్రారంభించి వారసత్వ వృక్షాల డాక్యుమెంట్ రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 800 పురాతన వృక్షాలను గుర్తించారు. ఈ వారసత్వ వృక్షాలు చారిత్రక, పర్యావరణ ప్రాముఖ్యతను కలిగి ఉన్నట్లు డాక్యుమెంట్‌లో పొందుపరుస్తున్నారు. శతాబ్దాలుగా వైజాగ్ అభివృద్ధిలో భాగస్వామ్యమవుతున్న ప్రతి చెట్టును పరిరక్షించాలన్నది వీరి ప్రధాన ఉద్దేశం.

కాపాడితేనే మనుగడ

వారసత్వ వృక్షాలు నేల సారవంతం పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి. వృక్షజాలం, జంతుజాలాల జీవిత కాలాన్ని పెంచడమేకాకుండా.. భూగర్భ జల వనరులు పెంపొందించడంలోనూ ముఖ్య భూమిక వహించి ప్రజలకు ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చుతాయి. ఈ పురాతన వృక్షాలు మొత్తం పర్యావరణ వ్యవస్థకు బూస్టర్‌లుగా కార్బన్ డయాక్సైడ్ నుంచి రక్షించే రక్షకులుగా వ్యవహరిస్తున్నాయి. ఈ చెట్లను సంరక్షించడం, వాటిని తదుపరి తరానికి అందించడం చాలా కీలకమని ఇంటాక్ బృందం చెబుతోంది. హెరిటేజ్ ట్రీ వాక్ పేరుతో ఇంటాక్ చాప్టర్ కన్వీనర్ డా.రాజశేఖర్ రెడ్డి, కో–కన్వీనర్ డా.సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఎడ్వర్డ్ పాల్, జయశ్రీ హట్టంగిడి, మయాంక్ కుమారి డియో, వెంకటరమణారెడ్డి, తన్మయ్ ముఖోపాధ్యాయ, వివేక్ రాథోడ్ తదితర సభ్యులు, పర్యావరణ వేత్తల సమక్షంలో ఈ డాక్యుమెంట్ తయారవుతోంది. మరో 15 రోజుల్లో తమ పరిశోధన పూర్తి చేసి వారసత్వ వృక్షాలకు సంబంధించిన సమగ్ర డాక్యుమెంట్ సిద్ధం చేసి భావితరాలకు అందించనుంది.



వందేళ్ల నాటి చెట్టు

సింహాచలం కొండపై 250 ఏళ్ల నాటి చెట్టు

ఇంటాక్ ప్రతినిధుల పరిశోధనల్లో శతాబ్దాల నాటి చెట్లను గుర్తిస్తున్నారు. ఇవి విశాఖ పర్యావరణ పరిరక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు డాక్యుమెంట్‌లో స్పష్టం చేశారు. నగర పరిధిలో అనేక చెట్లు 200 సంవత్సరాలకు పైగా వయసున్నవి ఉన్నాయి. సింహాచలం కొండపై ఉన్న ఒక మర్రి చెట్టు వయసు దాదాపు 250 ఏళ్లు ఉంటుందని గుర్తించారు. వాల్తేరు డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలో ఉన్న చెట్టు 130 ఏళ్లనాటిది. ఆంధ్ర విశ్వవిద్యాలయం సిరిపురం క్వార్టర్స్‌లో 200 ఏళ్లనాటి మర్రి చెట్టు, రావిచెట్టు, మామిడి చెట్టు ఉన్నట్లు గుర్తించారు. ఇలా నగరంలో వివిధ ప్రాంతాల్లో శతాబ్ది వృక్షాలున్నట్లు ఇంటాక్ పరిశీలనలో బయటపడుతున్నాయి.



భావితరాలకు అందించేందుకు..



50 ఏళ్లు పైబడిన చెట్టు భూ సారవంతంతో పాటు భూగర్భ జల వనరుల్ని పెద్ద ఎత్తున సంరక్షిస్తుంది. ఒక భారీ మర్రి చెట్టు తన జీవిత కాలంలో 5 వేల టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను సేకరిస్తుంది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి అని ప్రచారం చేస్తారు. కానీ.. ప్రస్తుతం ఉన్న ఈ తరహా వారసత్వ వృక్షాన్ని ఒకదాన్ని సంరక్షిస్తే వందల మొక్కలు నాటిన ఫలితం ఉంటుంది. అందుకే ఈ తరహా హెరిటేజ్ ట్రీ ప్రొటెక్షన్ కోసం వర్క్‌షాప్‌లు నిర్వహించాలని భావిస్తున్నాం. పర్యావరణ వ్యవస్థ స్థిరత్వం కోసం పని చేసే వారసత్వ వృక్ష సంపదను విశాఖ ప్రజలంతా కలిసికట్టుగా కాపాడాలని కోరుతున్నాం.

– ప్రొ.డా.కామేశ్వరరావు, ఇంటాక్ ప్రతినిధి

భీమిలిలో టన్ను రూ.758 అగనంపూడిలో రూ.1,394

ఇసుక ధరలు నిర్ణయించిన జిల్లా గనులు, భూగర్భ శాఖ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ మయూర్ అశోక్, పలు శాఖల అధికారులు

మహారాణిపేట: నూతన ఇసుక సరఫరా విధానం ప్రకారం ఆధార్ కార్డుకు 20 టన్నుల ఇసుక మాత్రమే సరఫరా చేస్తామని భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డీవీఎస్ఎన్ రాజు తెలిపారు. విశాఖ ప్రజల అవసరాల నిమిత్తం శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల నుంచి ఇసుక తీసుకొచ్చి ఇక్కడ విక్రయించడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అగనంపూడి ఇసుక డిపోలో 90 వేల టన్నులు, భీమిలి ఇసుక డిపోలో 90 వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్లు వెల్లడించారు. అగనంపూడి ఇసుక డిపోలో టన్ను ఇసుక ధర రూ.1,394, భీమిలి ఇసుక డిపోలో టన్ను ఇసుక ధర రూ.758గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 8 నుంచి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక విక్రయాలు జరుగుతాయన్నారు. కాగా.. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ చేయడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని డీడీ హెచ్చరించారు. దీనిపై ఫిర్యాదుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 0891–2590100కు ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జిగా ఎస్‌డీసీ, డిప్యూటీ డైరెక్టర్ కంట్రోలర్(సివిల్ డిఫెన్స్)ను నియమించారు.

సోమవారం నుంచి సరఫరా చేయండి

జిల్లాలో సోమవారం నుంచి ఇసుక సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి శనివారం ఆయన కలెక్టర్లతో ఇసుక సరఫరా విధానంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ వర్చువల్‌గా, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ కలెక్టరేట్ నుంచి ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా నే వినియోగదారుడు చెల్లింపులు చేయాలని, ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యమివ్వాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జేసీ అధికారులతో మాట్లాడారు. ఇసుక సరఫరా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి, భూగర్భ గనుల శాఖ ఉప సంచాలకుడు డి.ఇ.వి.ఎస్.ఎస్.ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపొద్దు

జేసీ మయూర్ అశోక్ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ప్రజలపై ఆర్థిక భారం పడకుండా అందుబాటు ధరలకే నిత్యావసరాలు అందేలా చూడాలని జిల్లాలోని ట్రేడర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులకు జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ సూచించారు. సివిల్ సప్లై, మార్కెటింగ్, వర్తకులతో శనివారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఆయన సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలకు లోబడి స్టాక్ నిల్వలను ఉంచాలని, పరిమితికి మించి నిల్వలు ఉంచితే చర్యలు తప్పవన్నారు. బియ్యం, పంచదార, పప్పుదినుసుల ధరల నియంత్రణపై సమీక్షించి మార్గదర్శకాలు జారీ చేశారు. ఇటీవల కాలంలో బియ్యం, పంచదార, పప్పుదినుసుల ధరలు క్రమంగా పెరుగుతున్నాయని, ప్రజలపై ఆర్థికంగా భారం పడుతోందని పేర్కొన్నారు. లాభనష్టం లేకుండా సరసమైన ధరలకు సరకులను విక్రయించాలని చెప్పారు. సరకు నిల్వలపై జిల్లా కమిటీ నియమించామని గుర్తు చేశారు. ప్రజల సౌకర్యార్థం నగర పరిధిలోని 13 రైతు బజార్లలో బియ్యం, పంచదార, పప్పుదినుసులతో కూడిన ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని డీఎస్‌వో, మార్కెటింగ్ శాఖ ఏడీని ఆదేశించారు. ఈ క్రమంలో వర్తకులు వారి సమస్యలను జేసీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకుంటామని, లాభాపేక్ష లేకుండా విక్రయాలు జరుపుతామని ఈ సందర్భంగా వర్తకులు పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్‌వో సూర్యప్రకాష్, మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్, సివిల్ సప్లై విభాగం అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వర్తకుల సంఘం ప్రతినిధులు, ట్రేడర్లు, హోల్ సేలర్స్, రిటైలర్స్ తదితరులు పాల్గొన్నారు.

9న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

మహారాణిపేట: మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈ నెల 9న విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఉదయం 7 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకొని అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా పోర్టు గెస్టు హౌస్‌కు వెళ్తారు. కొంతసేపటి తరువాత సాగర్‌నగర్‌లోని సొంతింటికి వెళ్తారు. సాయంత్రం మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్షన్‌లో శ్రీ కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొంటారు. 10న సాయంత్రం 6 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో జరిగే పుస్తకావిష్కరణలో పాల్గొంటారు. 12న పలు కార్యక్రమాలకు హాజరవుతారు. 13న ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ వెళ్తారు.

నగరం.. సర్వం జగన్నాథం

- నేటి నుంచి జగన్నాథ స్వామి రథయాత్ర
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు, వివిధ సంస్థలు



జగన్నాథుని రథం ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు

డాబాగార్డెన్స్: జగాలనేలే జగన్నాథ స్వామి రథయాత్ర సందర్భంగా నగరంలో ఆదివారం నుంచి ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది. 10 రోజుల పాటు రథయాత్ర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పలు ఆలయాలు సిద్ధమయ్యాయి. పూరీ తరహాలోనే జగన్నాథుడి రథయాత్రను నిర్వహించేందుకు నగరంలోని అతిపురాతన టౌన్ కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 9.20 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 4.15 గంటలకు టౌన్‌కొత్త రోడ్డు నుంచి ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు, పూర్ణామార్కెట్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా టర్నర్ సత్రం వరకు వేదపారాయణం.. గీతాపారాయణాలు.. మేళ తాళాలతో అత్యంత వైభవంగా స్వామి రథయాత్ర నిర్వహించనున్నారు.

- జిల్లా పరిషత్ శ్రీకృష్ణ మందిర్‌లో సాయంత్రం ఐదు గంటలకు బలభద్ర, సుభద్రా సమేత జగన్నాథ స్వామిని రథంపై ఊరేగించనున్నారు.
- సాగర్‌నగర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు రథయాత్ర ప్రారంభకానుంది. సాగరతీరాన వీఎంఆర్డీఏ పార్కు వద్ద బయలు దేరి.. వైఎంసీఏ, కాళీమాత ఆలయం, రామకృష్ణామిషన్ మీదుగా సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రం వరకు రథయాత్ర సాగనుంది. దారి పొడవునా బెంగాల్, ఒడిశాకు చెందిన పలు భజన మండళ్ల భజనలు, నాదస్వరం, కీర్తనలు, కోలాటం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గురజాడ కళాక్షేత్రానికి చేరుకున్న తర్వాత స్వామికి 1008 రకాల ప్రత్యేక వంటకాలను ప్రీతి పూర్వకంగా అర్పించనున్నారు. అనంతరం భక్తులకు వితరణ చేయనున్నారు.

ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో..

బీచ్‌రోడ్డు: ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా రేడియా వద్ద ఉన్న జగన్నాథ స్వామి ఆలయం నుంచి సాయంత్రం రథయాత్ర ప్రారంభం కానుందని ఉత్కల్ సమాజ్ అధ్యక్షుడు నాయక్ తెలిపారు. సిరిపురం, ఏయూ అవుట్ గేట్, చిన్న వాల్తేరు, వీఎంఆర్డీఏ పార్కు మీదుగా లాసన్స్ బే కాలనీకు రథయాత్ర చేరుకుంటుందన్నారు.



ప్రధాన ఆలయంలో పుష్పాలంకరణ

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



టౌన్ కొత్తరోడ్డు జగన్నాథ స్వామి ఆలయం నుంచి ఆదివారం సాయంత్రం 4.15 గంటలకు రథయాత్ర ప్రారంభమై టర్నర్ చౌల్ట్రీ వద్ద ముగియనుంది. ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు స్వామి దశావతారాల్లో దర్శనమివ్వనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్న దృష్ట్యా క్యూలు, బారికేడ్లు ఏర్పాటు చేశాం. భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశాం. వివిధ శాఖల నుంచి పలువురు సిబ్బందిని నియమించాం. ప్రతి రోజూ మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందజేయనున్నాం. సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 గంటల వరకు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశాం. ఉచిత దర్శనంతో పాటు రూ.20, రూ.50, రూ.200 టికెట్లపై ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నాం.

– టి.రాజగోపాల్‌రెడ్డి, ఆలయ ఈవో

గురుకులాలపై నమ్మకాన్ని నిలబెట్టాలి

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సునీల్ రాజ్‌కుమార్



మాట్లాడుతున్న సునీల్ రాజ్‌కుమార్

ఆరిలోవ: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి కె.సునీల్ రాజ్‌కుమార్ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సూచించారు. శ్రీకృష్ణాపురం గురుకులాన్ని శనివారం సందర్శించిన ఆయన ఇక్కడ సమావేశ మందిరంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని గురుకులాల ప్రిన్సిపాల్స్, ఆఫీస్ సూపరింటెండెంట్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురుకులాల సిబ్బందిపై నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడ చేరుస్తున్నారని, దానిని నిలబెట్టుకోవాలని అన్నారు. విద్యార్థులకు పౌష్టిక ఆహారం, వసతి, వైద్యంతో పాటు విద్య అందించడానికి బోధన, బోధనేతర సిబ్బంది కృషి చేయాలని సూచించారు. గురుకుల విద్యార్థులను ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. ఇప్పటికే పలువురు విద్యార్థులు ఆయా సీట్లు సాధించడం అభినందనీయమని, ఆ ఒరవడిని కొనసాగించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో గురుకుల విద్యార్థుల కోసం రెండుచోట్ల ఐఐటీ ఇన్‌స్టిట్యూట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గురుకులాల సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందని, ఇందులో భాగంగా పదోన్నతుల విషయంలో చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డీఎస్సీలో 439 మంది ఉపాధ్యాయుల భర్తీకి నోటిఫికేషన్ రానుందన్నారు. కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి గురుకులాల సమన్వయాధికారి ఎస్.రూపావతి, శ్రీకృష్ణాపురం గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, రెండు జిల్లాల గురుకులాల ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

కేవైసీ అప్‌డేట్ పేరిట టోకరా

ఉక్కునగరం: కేవైసీ అప్‌డేట్ పేరిట వచ్చిన లింక్‌ను తెరిచిన కొంత మంది తమ బ్యాంక్ ఖాతాల్లో డబ్బు మాయం కావడంతో లబోదిబోమంటున్నారు. రెండు రోజులుగా పలువురు మొబైల్స్‌కు యూనియన్ బ్యాంక్ కేవైసీ అప్‌డేట్. ఏపీకే పేరిట లింక్ మేసేజ్‌లు వస్తున్నాయి. కేవైసీ అప్‌డేట్ చేయాలనే ఉద్దేశంతో చాలా మంది ఈ లింక్ తెరిచారు. దీంతో వారి ఖాతాల్లో ఉన్న నగదు మాయమైంది. ఒకరిది రూ.20వేలు పోగా, మరొకరి ఖాతాలో రూ.40వేలు మాయమైంది. గరిష్టంగా ఒకరిది రూ.లక్ష పోయింది. దీంతో బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. వారు ఈ కేసులను సైబర్ క్రైం స్టేషన్‌కు బదిలీ చేశారు. తెలియని లింక్‌లను తెరవొద్దని విస్తృతంగా ప్రచారం జరుగుతున్నా.. ప్రజలు అప్రమత్తంగా లేకుండా మోసాల్లో చిక్కుకోవడం పట్ల బ్యాంక్ అధికారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల నుంచి ఎటువంటి కాల్స్, మెసేజ్‌లు రావని, ఏమైనా అధికారిక సమాచారం ఉంటే ఆయా బ్యాంకుల అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే పొందుపరుస్తామని అధికారులు తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్.. సంస్కరణవాది



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ నాయకులు

కొమ్మాది: బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి, సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం వీరు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవిరెడ్డి, పేడాడ రమణికుమారి, ముల్లు అప్పారావు, పేర్ల విజయచంద్ర, వంకాయల మారుతీప్రసాద్, అప్పన్న, వనపల్లి ఈశ్వరరావు, పిల్లా సూరిబాబు, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, రఘురాజు, నరేష్, గున్నశెట్టి శ్రీనివాస్, మోహనరావు, రామప్పుడు, మధుసూధనరెడ్డి, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, దాసు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ పోరులో టైటాన్స్ గెలుపు

- ఒక్క పరుగు తేడాతో టైగర్స్ ఓటమి
- అవినాష్ అజేయ సెంచరీ
- సీజన్‌లోనే అత్యధిక స్కోర్ నమోదు


అజేయ సెంచరీతో చెలరేగిన అవినాష్


అర్ధసెంచరీ చేసిన పాండురంగరాజు

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ టీ–20 మూడో సీజన్‌లో బెజవాడ టైగర్స్‌తో తలపడిన గోదావరి టైటాన్స్ ఒక్క పరుగు తేడాతో విజయాన్నందుకుంది. ఇరు జట్లు సీజన్‌లోనే అత్యధిక స్కోర్ నమోదు చేశాయి. బెజవాడ టైగర్స్ టాస్ గెలిచి టైటాన్స్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించగా.. 225 పరుగులతో సీజన్‌లోనే అత్యధిక స్కోర్‌ను నమోదు చేసింది. టైగర్స్ కూడా దీటుగానే ఆడినప్పటికీ.. కేవలం ఒక్క పరుగు తేడాతో పరాజయం పాలైంది. పీఎంపాలెంలోని వైఎస్సార్ స్టేడియంలో శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో టైటాన్స్ టాపార్డర్ ఏకంగా 218 పరుగులు చేయగా... చివరి పది బంతుల్లోనే ఏడు పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయి ఆలౌట్ అయింది. తొలి వికెట్‌కు కెప్టెన్ జ్ఞానేశ్వర్(41, 30 బంతుల్లోనే 4x4, 2x6) వంశీకృష్ణ(45, 33 బంతుల్లోనే 3x4,3x6) 85 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేసి గట్టి పునాది వేశారు. వన్‌డౌన్‌గా వచ్చిన వికెట్ కీపర్ పాండురంగరాజు(51, 24 బంతుల్లోనే 3x4,4x6) అర్ధసెంచరీ నమోదు చేశాడు. హేమంత్‌రెడ్డి సైతం(60, 22 బంతుల్లోనే 5x4.5x6) అర్ధ సెంచరీ నమోదు చేశాడు. శశికాంత్ 17 పరుగులు చేయగా.. తొలి నాలుగు వికెట్లకు 218 పరుగులు నమోదయ్యాయి. అప్పటికే 18.2 ఓవర్లు ముగియగా పరుగులు తీసే క్రమంలో 20వ ఓవర్ చివరి బంతికి 225 పరుగుల వద్ద ఆలౌటైంది. టైగర్స్ బౌలర్లు అఖిల్ నాలుగు, హరిశంకర్ మూడు వికెట్లు తీశారు.

సీజన్‌లోనే అత్యధిక లక్ష్య ఛేదన

226 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన టైగర్స్ తొలి వికెట్‌ను 17 పరుగులకే కోల్పోయింది. ధృవ్ 17 పరుగులకే వెనుదిరగ్గా కెప్టెన్‌గా బాధ్యత తీసుకున్న మహీప్ ఒక్క పరుగుకే పెవిలియన్‌కు చేరాడు. దూకుడుగా ఆడిన లక్ష్మణ్(46, 23 బంతుల్లో 6x4,3x6) సమన్విత్‌కు క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దీంతో 73 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి టైగర్స్ కష్టాల్లో పడింది. అయితే అవినాష్ అజేయంగా సీజన్‌లోనే తొలి సెంచరీ నమోదు చేశాడు. అయినప్పటికీ ఒక్క పరుగు తేడాతో టైగర్స్ ఓటమి పాలైంది. అవినాష్ (105, 58 బంతుల్లోనే 2x4,11x6) చివరికంటూ నిలిచాడు. సాయిరాహుల్(28) సహకరించగా ఇన్నింగ్స్ చివరి బంతికి మనీష్(13) రనౌట్ కావడంతో ఆరో వికెట్ 224 పరుగుల వద్ద కూలింది. అహితేష్ రెండు వికెట్లు తీశాడు.

వారియర్స్‌పై రైడర్స్ విజయం

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన రెండో మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కోస్టల్ రైడర్స్ ఎనిమిది వికెట్లకు 165 పరుగులు చేసింది. ఓపెనర్, కెప్టెన్ రషీద్ 48 బంతుల్లో 67 పరుగుల చేయగా మరో ఓపెనర్ ధరణి కుమార్ 21 పరుగులు చేశాడు. తొలి వికెట్‌కు వీరిజోడి 87 పరుగులు జోడించింది. అభిషేక్ 28, నరసింహారాజు 23 పరుగులతో రాణించారు. వై.రెడ్డి 26 పరుగులిచ్చి ఐదుగుర్ని పెవలియన్‌కు పంపాడు. ప్రతిగా వైజాగ్ వారియర్స్ పది ఓవర్లు ముగిసేసరికి 2 వికెట్లు కోల్పోయి 74 పరుగులు చేసింది. ఓపెనర్ సుజన్ డకౌట్ కాగా మరో ఓపెనర్ అశ్విన్‌హెబ్బర్ 31 పరుగులు చేశాడు. కెప్టెన్ భరత్(69) నిలకడగా ఆడగా కరణ్‌షిండే(41) సహకరించాడు. వీరిజోడి మూడో వికెట్‌కు 91 పరుగులు జోడించింది. వారియర్స్ విజయం దిశగా సాగుతున్న తరుణంలో రైడర్స్ బౌలర్ స్టీఫెన్ 19వ ఓవర్ తొలి బంతికి భరత్, చివరి బంతికి కరణ్ పెవిలియన్ దారి పట్టించాడు. చివరికి వారియర్స్ నాలుగు వికెట్లే కోల్పోయినా 162 పరుగులతో ఇన్నింగ్స్ ముగించడంతో కోస్టల్ రైడర్స్‌ను విజయం వరించింది. స్టీఫెన్ మూడు వికెట్లు తీశాడు.

ప్రేమగా.. పెంపుడు శునకంతో..


పెంపుడు కుక్కతో..


పెంపుడు కుక్కలను వెటర్నరీ ఆస్పత్రికి తీసుకొచ్చిన వాటి యజమానులు


వ్యాక్సిన్ కోసం క్యూలో వేచి ఉన్న పెంపుడు కుక్కల యజమానులు


టీకా వేస్తున్న వెటర్నరీ డాక్టర్

దాబాగార్డెన్స్: జడ్జికోర్టు సమీపంలోని ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రి ప్రాంగణంలో శనివారం పెంపుడు శునకాలు సందడి చేశాయి. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ టీకాలను వేయించేందుకు నగరం నుంచి పలువురు జంతు ప్రేమికులు తమ పెంపుడు శునకాలను ఇక్కడకు తీసుకొచ్చారు. వాటిని లాలిస్తూ.. బుజ్జగిస్తూ ఆస్పత్రి ఆవరణలో నిరీక్షించారు. అనంతరం టీకాలు వేయించారు. శునకాలు కూడా యజమానులపై ఎంతో ప్రేమ చూపుతూ.. విధేయతతో మెలుగుతూ అలరించాయి.

దివ్యాంగుడిపై దాడిచేసిన ఆరుగురి అరెస్టు

పీఎం పాలెం: దివ్యాంగుడిపై దాడిచేసిన ఆరుగుర్ని పీఎంపాలెం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రాంబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మాది వైఎస్సార్ కాలనీలో నివసిస్తున్న చిరికి రాజ్ కిశోర్ తిమ్మాపురంలోని ఓ ప్రైవేట్ విద్యా సంస్థలో పని చేస్తున్నాడు. అతడు దివ్యాంగుడు. ఈ నెల 3వ తేదీ సాయంత్రం 8 గంటల సమయంలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలు దేరాడు. జురాంగ్ రోడ్డులోని నారాయణ స్కూల్ సమీపంలో మధురవాడ, పీఎంపాలెం ప్రాంతాలకు చెందిన పైల వినయ్, తేజ, యోగి మరో ముగ్గురు కలిసి మద్యం సేవిస్తున్నారు. అదే రోడ్డులో బైకుపై వస్తున్న దివ్యాంగుడు రాజ్ కిశోర్‌ను అడ్డగించి దాడిచేశారు. అతని జేబులో ఉన్న రూ.3 వేలు బలవంతంగా లాక్కొన్నారు. ఇంటికి వచ్చి తనపై దాడి చేసి డబ్బులు లాక్కొన్నారని చెప్పడంతో బాధితుడు తమ్ముడు భుజేష్ సంఘటన స్థలానికి వెళ్లి వీరిని నిలదీశాడు. ఈ క్రమంలో రాజ్‌కిశోర్, భుజేష్‌లపై ఆరుగురు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

బ్లడ్ క్యాన్సర్ రోగికి మగ బిడ్డ


బిడ్డకు జన్మించిన మహిళను అభినందిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, వైద్యులు

మహారాణిపేట: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళ సిజేరియన్ ద్వారా మగ బిడ్డకు జన్మనిచ్చింది. కేజీహెచ్‌లో పలు విభాగాల వైద్యులు సమన్వయంతో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించారు. తల్లి, బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన 24 ఏళ్ల అరుణకుమారి రెండో గర్భం దాల్చింది. ఏడో నెలలో రక్త పరీక్షలు చేయగా తీవ్రమైన బ్లడ్ క్యాన్సర్ అని శ్రీకాకుళంలో రిమ్స్ ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. వెంటనే కేజీహెచ్‌కు ఈ కేసును రిఫర్ చేశారు. కేజీహెచ్‌లోని మెడికల్ అంకాలజీ విభాగంలోని క్యాన్సర్ వైద్య నిపుణులు అరుణకుమారికి ఆరోగ్యశ్రీ ద్వారా సకాలంలో వైద్య సేవలు అందించారు. అరుణకుమారికి అనీమియా(రక్తహీనత), తక్కువ ప్లేట్‌లెట్స్ ఉన్నట్లు కేజీహెచ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శిల్ప తెలిపారు. శనివారం ప్రసూతి వైద్యులు సిజేరియన్ చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇటువంటి రక్తకణాల క్యాన్సర్‌లో తల్లి, బిడ్డ సురక్షితంగా కోలుకోవడం చాలా అరుదైన సంఘటన అని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. శనివారం తల్లి, బిడ్డను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని అభినందించారు. అరుణకుమారి వైద్యం కోసం గైనకాలజిస్టు డాక్టర్ సొమని, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ షర్మిల, నర్సింగ్ సిబ్బంది తదితరులు ఎంతో సహకారం అందించారని కేజీహెచ్ అంకాలజి విభాగాధిపతి డాక్టర్ శిల్పా తెలిపారు.

ట్రెజరీ శాఖలో అవినీతిపై రాష్ట్ర డైరెక్టర్ విచారణ


డీటీవో కార్యాలయంలో విచారిస్తున్న రాష్ట్ర ట్రెజరీ, లెక్కల శాఖ డైరెక్టర్ మోహన్‌రావు

మహారాణిపేట: ట్రెజరీ శాఖలో అవినీతి విలయ తాండవం చేస్తోందని పలు శాఖల అధికారులు, సిబ్బంది రాష్ట్ర ట్రెజరీ, లెక్కల శాఖ డైరెక్టర్ మోహన్‌రావుకు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన ఆయన శనివారం డీటీవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. ట్రెజరీ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులపై వచ్చిన ఆరోపణలపై ఫిర్యాదులు చేసిన వారి నుంచి వివరాలు సేకరించారు. పలు శాఖల అధికారులు, ఉద్యోగులు తాము పడుతున్న ఇబ్బందులను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొంత మంది లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. అనంతరం విశాఖ డీటీవో యార్లగడ్డ సుధాకరరావు, ఏటీవోలు, ఎస్‌టీవోలను డైరెక్టర్ విచారించారు. కాగా.. విధులకు సక్రమంగా హాజరు కాని 8 మంది ట్రెజరీ ఉద్యోగులకు ఇటీవల అధికారులకు మెమోలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

రథయాత్ర కోసం స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: పూరీ రథయాత్ర కోసం వాల్తేర్ డివిజన్ నుంచి పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. విశాఖపట్నం నుంచి బయల్దేరిన తొలి స్పెషల్ విశాఖపట్నం – పూరి స్పెషల్ రైలుకు శనివారం మధ్యాహ్నం ఎంపీ శ్రీభరత్, డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. పూరి రథయాత్ర సందర్భంగా సుమారు 315 ప్రత్యేక రైళ్లు భారతీయ రైల్వే నడుపుతుందని, వాల్తేర్ డివిజన్ పరిధిలో విశాఖపట్నం, గుణుపూర్, జగదల్‌పూర్ నుంచి స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు డీఆర్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ నుంచి ప్రత్యేక రైళ్లు ఇవే...

- గుణుపూర్ – పూరి (08345) స్పెషల్ (వయా హరిపూర్‌గ్రామ్, అర్గుల్) ఈ నెల 14, 16న గుణుపూర్‌లో రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4.15 గంటలకు పూరి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరి – గుణుపూ ర్ (08346) స్పెషల్ ఈ నెల 7, 15, 17న రాత్రి 9 : 20 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు గుణుపూర్ చేరుకుంటుంది.
- పలాస – పూరి (08331) (వయా హరిపూర్‌గ్రామ్, అర్గుల్) స్పెషల్ ఈ నెల 7, 15, 17న పలాసలో మధ్య రాత్రి 12.15 గంటలకు బయల్దేరి అదేరోజు తెల్లవారుజామున 5.35 గంటలకు పూరి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరి – పలాస (08332) స్పెషల్ ఈ నెల 8, 16, 18న తెల్లవారుజామున 4 గంటలకు పూరిలో బయల్దేరి అదే రోజు ఉదయం 10 గంటలకు పలాస చేరుకుంటుంది.
- విశాఖపట్నం – పూరి (08347) (వయా హరిపూర్‌గ్రామ్, అర్గుల్) స్పెషల్ విశాఖపట్నంలో ఈ నెల 6, 14, 16న మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 10.45 గంటలకు పూరి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరి – విశాఖపట్నం (08348) స్పెషల్ పూరిలో ఈ నెల 8, 16, 18న మధ్య రాత్రి (తెల్లవారుజామున) 1.45 గంటలకు బయల్దేరి అదే రోజు ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.
- జగదల్‌పూర్ – పూరి (08349) (హరిపూర్‌గ్రామ్, అర్గుల్) స్పెషల్ ఈ నెల 6, 14, 16న ఉదయం 10.45 గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యరాత్రి 12.45 గంటలకు పూరి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరి – జగదల్‌పూర్ (08350) స్పెషల్ పూరిలో ఈ నెల 8, 16, 18న మధ్య రాత్రి 12.15 గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 3.10 గంటకు జగదల్‌పూర్ చేరుకుంటుంది.

14న గీతం అడ్మిషన్ టెస్ట్

కొమ్మాది: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 14న గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) నిర్వహిస్తున్నట్లు స్కూల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ తెలిపారు. బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, మైక్రోబయోలజీ, ఫిజిక్స్, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో నాలుగేళ్ల బీఎస్సీ కోర్సులు, మూడేళ్ల బీఎస్సీ కోర్సులు, మూడేళ్ల బీసీఏ కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని, వీటి కోసం గీతం ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో 28 మంది ట్రైనీ ఐపీఎస్‌లు


ట్రైనీ ఐపీఎస్ బృందంతో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: మేరీటైమ్ సెక్యూరిటీ మాడ్యూల్ నిమిత్తం 28 మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులు విశాఖకు వచ్చారు. ఈ సందర్భంగా శనివారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కలిశారు. అనంతరం బీచ్ రోడ్డులో పోలీస్ ఆఫీసర్స్ మెస్‌తో నిర్వహించిన సమావేశంలో సీపీ మేరీటైమ్ సెక్యూరిటీలో అనుభవాలు, మెలకువలను వివరించారు. దేశ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన విధులపై అవగాహన కల్పించారు.

విశాఖ పోర్టును సందర్శన

స్టడీ టూర్‌లో భాగంగా 21 మంది ట్రైనీ ఐపీఎస్‌ల బృందం శనివారం విశాఖ పోర్టు అథారిటీని సందర్శించింది. బృందానికి పోర్టులో మౌలిక సదుపాయాలు, ఆధునికీకరణ, యంత్రీకరణ, సరుకు హ్యాండ్లింగ్ పద్ధతులు, కవర్డ్ స్టోరేజ్ సౌకర్యాలు, సౌర శక్తి వ్యవస్థాపనలు, అంతర్గత, పారిశ్రామిక అవసరాల కోసం మలినాల శుద్ధి ప్లాంట్, స్మార్ట్ పోర్ట్ పద్ధతులు వంటి విషయాలను పోర్టు అధికారులు వివరించారు. పోర్టు కలాకలాపాలు, పోర్టు అనుసరిస్తున్న నవీన పద్ధతులపై అవగాహన కల్పించారు. పోర్టులో ఆతిథ్యం పట్ల ట్రైనీ ఐపీఎస్ బృందం పోర్టు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.